క్లుప్తంగా

బాల్యవివాహాలు జరిపిస్తే చర్యలు



కారెడ్డిపల్లితండాలో న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి జయలక్ష్మి

కదిరి అర్బన్: ఎక్కడైనా బాల్య వివాహాలు జరిపిస్తే చర్యలు తప్పవని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి జయలక్ష్మి హెచ్చరించారు. శనివారం మండల పరిధిలోని కారెడ్డిపల్లి తండాలో న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి జయలక్ష్మి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరిపిస్తే ఇరు కుటుంబాలపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. వివాహానికి హాజరైన వ్యక్తులు, పురోహితులు కూడా శిక్షార్హులవుతారన్నారు. బాలికల బంగారు భవిష్యత్తును దృష్టిలో ఉంచుకోవాలన్నారు. అనంతరం బాల్య వివాహాల అనర్థాలు, చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీడీపీఓ రాధిక, డా. వినోద్‌కుమార్, న్యాయవాదులు లింగాల లోకేశ్వరెడ్డి, నరసింహులు, రెడ్స్ అధ్యక్షురాలు భానుజాతో పాటు పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

అట్రాసిటీ చట్టంపై అవగాహన అవసరం

తాడిమర్రి: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టంపై అవగాహన పెంచుకోవాలని తహసీల్దార్ భాస్కర్ రెడ్డి, ఎంపీడీఓ వెంకట రంగారావు దళితులకు సూచించారు. మండలంలోని పిన్నదరి ఎస్సీ కాలనీలోని ఆర్టీటీ పాఠశాలలో వారు పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో ఎవరైనా కులం పేరుతో దూషించినా, అత్యాచారం తదితర హింసాత్మక చర్యలకు పాల్పడినా ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ యాక్టుపై కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు. డిప్యూటీ ఎంపీడీఓ విజయ శేఖర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఈ-క్రాప్ నమోదు వేగవంతం చేయండి

తాడిమర్రి: మండలంలో ఖరీఫ్‌కు సంబంధించి ఈ-క్రాప్ నమోదును వేగవంతం చేయాలని ఏఓ శేఖర్ రైతు సేవా కేంద్రాల సిబ్బందిని ఆదేశించారు. స్థానిక రైతు సేవా కేంద్రంలో శనివారం ఆయన మండలంలోని ఆర్ఎస్‌కేల సిబ్బంది సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వారం వివిధ పంటల కింద నమోదైన విస్తీర్ణాలను సక్రమంగా అంచనా వేసి వ్యవసాయ కార్యాలయంలో సమర్పించాలన్నారు. కౌలుదారులకు కౌలుదారుల హక్కుల పత్రాలను అందించాలన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమాలు ప్రతి నెలలోఒకసారి తప్పని సరిగా నిర్వహించాలన్నారు. ఇండెంట్లు పెట్టి ఎరువులు రైతులకు అందుబాటులో ఉంచాలని ఆయన తెలిపారు.

గోపురం వినాయకుడి లడ్డూ @ రూ.55 వేలు



లడ్డూను వేలంలో దక్కించుకున్న మోహన్‌రెడ్డి

పుట్టపర్తి: పుట్టపర్తి గోపురం సెకండ్ క్రాస్ వినాయకుడి లడ్డూ రూ.55 వేలు పలికింది. పట్టణానికి చెందిన మోహన్‌రెడ్డి వేలంలో లడ్డూను రూ.55 వేలకు పాట పాడి దక్కించుకున్నారు. అలాగే పట్టణంలోని వాడవాడలా వినాయకుని నిమజ్జన కార్యక్రమం గత రెండు రోజులుగా అట్టహాసంగా జరుగుతోంది.నియోజకవర్గంలో అన్ని మండలాలు గ్రామాలలో నిమజ్జనం కొనసాగుతోంది.

వరసిద్ధి వినాయక లడ్డూ @ రూ.2 లక్షలు



వినాయక లడ్డూ, వెండి కాయిన్‌ను దక్కించుకున్న వార్డు ప్రజలు

ధర్మవరం: పట్టణంలోని 16వవార్డు సచివాలయం వెనుక వరసిద్ధి వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శనివారం లడ్డూతోపాటు వెండి కాయిన్లను వేలం వేశారు. వార్డుకు చెందిన పరిశే నారప్ప లడ్డూను రూ.2 లక్షలకు వేలంపాటలో దక్కించుకున్నాడు. మొదటి వెండి కాయిన్ పరిశే నరసింహులు రూ.43,516, రెండో వెండి కాయిన్‌ను పోలా చిన్నరాముడు అండ్ సన్స్ రూ.51,500లకు దక్కించుకున్నారు. వేలంపాటలో లడ్డూతోపాటు వెండి కాయిన్‌లను దక్కించుకున్న వారిని కమిటీ సభ్యులు సన్మానించారు.

ముదిగుబ్బ: మండల కేంద్రంలోని సబ్ స్టేషన్ వెనుక వీధిలో వినాయకుని లడ్డూ(ప్రసాదం)ను వేలం వేశారు. చిన్న అనే యువకుడు రూ.1.10 లక్షలకు లడ్డూ దక్కించుకున్నాడు.



సాయికుల్వంత్ సభా మందిరంలో చిన్నారుల నృత్య ప్రదర్శన



సాయికుల్వంత్ సభా మందిరంలో వినాయక నృత్య ప్రదర్శన



నల్లచెరువు: నిమజ్జనానికి తరలివెళ్తున్న వినాయకుడు



గాండ్లపెంటలో నిమజ్జనానికి తరలివెళ్తున్న వినాయకుడు

గణపతి బప్పా మోరియా

సాక్షి బృందం: ధర్మవరం, పుట్టపర్తి, కదిరి నియోజకవర్గాల్లో శనివారం వినాయక నిమజ్జన వేడుకలు ఘనంగా జరిగాయి. ఆయా ప్రాంతాల్లో యువకులు, మహిళలు రంగులు చల్లుకుంటూ కేరింతలు కొడుతూ డ్యాన్స్‌లు చేస్తూ వినాయక విగ్రహాలను ఊరేగించారు. అనంతరం సమీపంలోని చెరువులు, కుంటల్లో విగ్రహాలను నిమజ్జనం చేశారు. ఈసందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.



పెడపల్లిలో నిమజ్జనానికి తరలిస్తున్న వినాయక విగ్రహం



ధర్మవరం మండలం కుణుతూరు వంకలో వినాయక నిమజ్జనం



ఓడీచెరువులో నిమజ్జనానికి బయలుదేరిన గణపయ్య



ధర్మవరంలో నిమజ్జనానికి తరలివెళుతున్న వినాయకుడు



సాయికుల్వంత్ సభా మందిరంలో వినాయకులను ఊరేగింపుగా తీసుకొస్తున్న దృశ్యం



నల్లమాడలో ఊరేగింపులో డీజే పాటలకు అనుగుణంగా స్టెప్పులు వేస్తున్న మహిళలు



నల్లమాడ మండలం యర్రవంకపల్లిలో వినాయకుడి ఊరేగింపులో పాల్గొన్న సర్పంచ్ రజనీకాంత్‌రెడ్డి



నల్లమాడ మండలం వంకరకుంటలో వినాయకుడి ఊరేగింపు..



పిన్నదరిలో వినాయకుని విగ్రహం ఊరేగిస్తున్న దృశ్యం

వంతెనలు ఇలా.. రాకపోకలు ఎలా?



రాసువారిపల్లి వద్ద దెబ్బతిన్న వంతెన



దొరిగిల్లు సమీపంలో వంతెన దుస్థితి

- శిథిలావస్థకు చేరిన వంతెనలు
- పట్టించుకోని ప్రభుత్వం
- ప్రజలకు తప్పని తిప్పలు

ముదిగుబ్బ: మండలంలోని మల్లేపల్లికి వెళ్లే రహదారిలో రాసివారిపల్లి తండా వద్ద మద్దిలేరు వాగుపై ఉన్న వంతెన, దొరిగిల్లు సమీపంలోని వంతెనలు దెబ్బతిన్నాయి. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ప్రధానంగా మలకవేమల క్రాస్ నుంచి మల్లేపల్లి, టీఎస్ పాళ్యం వైపు వెళ్లే రహదారిపై రాసువారిపల్లి తండా వద్ద మద్దిలేరు వాగుపై వంతెన పూర్తిగా దెబ్బతినడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ఈ వంతెన మీదుగా 30 గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. కదిరి మండలం బత్రేపల్లి మీదుగా పులివెందుల, తలుపుల ప్రాంతాలకు ఈ మార్గం మీదుగా వెళ్లవచ్చు. అలాంటి వంతెన భారీ వర్షాలకు గతంలో కొట్టుకుపోయినప్పటికీ రాకపోకల కోసం తాత్కాలికంగా సిమెంట్ పైపులు వేసి మట్టితో మరమ్మతు చేశారు.

రాకపోకలకు ఇక్కట్లు..

మండల కేంద్రం సమీపంలోని దొరిగిల్లు వద్ద ఉన్న పల్లపు వంతెన భారీ వర్షాలకు, వైవీఆర్ డ్యాం గేట్లు ఎత్తినప్పుడు వంతెనపై నాలుగు మీటర్ల ఎత్తుతో నీరు ప్రవహిస్తుంది. రెండు రోజుల పాటు నీరు ఉధృతి తగ్గకపోవడం వల్ల వాహన రాకపోకలు ఆగిపోతాయి. గతంలో ఈ పల్లపు వంతెన వాగు ఉధృతికి తట్టుకోలేక సిమెంట్ పైపులపై ఏర్పాటు చేసిన రోడ్డు ధ్వంసమైంది. ఆ వంతెనను తాత్కాలిక మరమ్మతులు చేయించారు. ఇటీవల వర్షాలకు కూడా కొంచెం దెబ్బతింది. ఈ వంతెన మీదుగా 20 గ్రామాల ప్రజల రాకపోకలు సాగించడంతో పాటు పులివెందులకు వెళ్లే బస్సులు కూడా ఈ వంతెనపై వెళతాయి. ఇక్కడ పటిష్టమైన హైలెవల్ వంతెనను ఏర్పాటు చేయాలని ఈ ప్రాంత వాసులు కోరుతున్నారు.

భారీ వర్షాలు వస్తే ఇబ్బందులే

దొరిగిల్లు సమీపంలో వున్న మద్దిలేరు వాగుపై ఏర్పాటు చేసిన పల్లపు వంతెన వైవీఆర్ డ్యాం గేట్లు ఎత్తిన రెండు రోజుల పాటు వాహన రాకపోకలు పూర్తిగా స్తంభించిపోతాయి. భారీ వర్షాలు వస్తే వంతెనపై నీళ్ల ప్రవహించడంతో పాటు వంతెన పూర్తిగా దెబ్బతింటుంది. ఇక్కడ హైలెవల్ వంతెన చాలా అవసరం.

– శివారెడ్డి, బూదనంపల్లి

శాశ్వత పరిష్కారం చూపాలి



మలకవేమల క్రాస్ నుంచి మల్లేపల్లి వైపున్న గ్రామాల వైపు వెళ్లే వారికి మద్దిలేరు వాగుపై హైలెవల్ వంతెనను ఏర్పాటు చేసి శాశ్వత పరిష్కారం చూపాలి. కదిరి ప్రాంతంలో భారీ వర్షాలు కురిస్తే ఈ వంతెనపై రాకపోకలు నిలిచిపోతాయి. హైలెవల్ వంతెనను ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

– వెంకటనారాయణ, మలకవేమల

ప్రతిపాదనలు పంపాం

రాసువారిపల్లి తండా వద్ద మద్దిలేరు వాగుపై హైలెవల్ వంతెన కోసం రూ.7.40 లక్షలు కావాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. అనుమతులు రాగానే వంతెన పనులు చేపడతాం.

– రాజేంద్రప్రసాద్, పంచాయితీ రాజ్ జేఈ

నేడు విద్యుత్ అంతరాయం

కదిరి టౌన్: పట్టణంలో ఆదివారం విద్యుత్ అంతరాయం ఉంటుందని విద్యుత్ ట్రాన్స్‌కో ఏఈ చెన్న కృష్ణ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. వినాయక నిమజ్జన శోభాయాత్రకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయడంలో భాగంగా విద్యుత్ టవర్స్ కొత్తవి ఏర్పాటు చేస్తున్నారని, అందులో భాగంగా ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అంతరాయం ఉంటుందన్నారు. కాలేజ్ సర్కిల్, ఆర్‌పీస్ట్రీట్, వాణివీధి, హరూన్ వీధి, టవర్ క్లాక్, జొన్న వీధి, సోమగుట్టవీధి, పోలీస్‌లైన్, ప్రభుత్వ ఆస్పత్రి, మున్సిపల్ అఫీసు, సంగం టాకీస్, కస్తూరిబాయి వీధి, వలీసాబ్ రోడ్డు, ఆల్మ్ ఖాన్ మసీదు ఏరియాలో విద్యుత్ అంతరాయం ఉటుందన్నారు.

వేతనాలు సక్రమంగా మంజూరు చేయండి

పుట్టపర్తి టౌన్: ప్రతి నెలా జీతాలు, ఈపీఎఫ్, ఈఎస్ఐ సక్రమంగా మంజూరయ్యేలా చూడాలని సబ్ ఇంజనీర్ దినేష్‌ను విద్యుత్ మీటర్ రీడర్లు కోరారు. శనివారం పుట్టపర్తి పట్టణంలో ఉన్న ఎస్ఈ కార్యాలంలోని చాంబర్‌లో సబ్ ఇంజనీర్ ప్రదీప్‌ను కలసి వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా మీటర్ రీడర్లు మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా పనిచేస్తున్నామని, మూడు నెలలుగా జీతాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. కుటుంబ పోషణ కష్టతరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతినెలా రావలసిన ఈపీఎఫ్, ఈఎస్ఐ సేవలు అందడం లేదన్నారు. కలెక్టర్ దృష్టికి పలుమార్లు తీసుకుపోసినా, న్యాయం జరగలేదని వాపోయారు. ఉద్యోగ భద్రత కల్పించి, ప్రతి నెలా జీతాలు ఇప్పించేలా చూడాలని కోరారు. సమస్యల పరిష్కారం కోసం సెప్టెంబర్ 1 నుంచి నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో వర్కింగ్ ప్రసిడెంట్ కిరణ్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు శాన్వాష్, కోశాధికారి దస్తగిరి, మీటర్ రీడర్లు వినోద్, నరేష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పంటల యాజమాన్యంపై అవగాహన

కొత్తచెరువు: పోతులకుంట రైతు సేవా కేంద్రంలో జిల్లా వనరుల కేంద్రం డీడీఏ శ్రీరాము నాయక్ ఆధ్వర్యంలో పంటల సస్యరక్షణ, యాజమాన్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. వేరుశనగ, కంది, మొక్క జొన్న, వరి పంటల సాగులో చేపట్టవలసిన మెలకువలు, నీటి యాజమాన్యంపై రైతులకు వివరించారు.

కల్యాణ మంటపానికి రూ.12 లక్షల విరాళం



రామసుబ్బారెడ్డిని సన్మానిస్తున్న రెడ్డి వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి తదితరులు

కదిరి: కాళసముద్రం గురుకుల పాఠశాల ఎదురుగా 'రెడ్డి వెల్ఫేర్ సొసైటీ' ఆధ్వర్యంలో నిర్మిస్తున్న రెడ్డి కల్యాణ మంటపానికి ఓడీ చెరువు మండలం మల్లెలవాండ్లపల్లికి చెందిన చింతా రామసుబ్బారెడ్డి రూ.12 లక్షలు విరాళం ప్రకటించారు. ఈ మేరకు సొసైటీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి శనివారం తమ కార్యాలయంలో మాట్లాడారు. విరాళంలో భాగంగా రూ.4 లక్షలు నగదు అందజేశారని, ఆయనకు రెడ్డి వేల్ఫేర్ సొసైటీ తరపున ధన్యవాదాలు తెలియజేసినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంపై ఫిర్యాదు

కదిరి టౌన్: తన కుమారుడు ధరహాస్ రోడ్డు దాటుతుండగా హేమంత్‌నాయక్ అనే వ్యక్తి స్కూటీ తగలడంతో కుడికాలు విరిగిందని వైఎస్ఆర్ నగర్‌కు చెందిన బాలుడి తల్లి శ్రావణి స్థానిక పట్టణ పోలీసు స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేసింది. ధరహాస్ ఈనెల 29న చిల్లర దుకాణానికి వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా, హేమంత్ నాయక్ స్కూటీ తగిలిందని బాలుడి తల్లి తెలిపింది. హేమంత్ నాయక్‌పై కేసు నమోదు చేసినట్లు పట్టణ పోలీసులు తెలిపారు.

కేసు నమోదు

కదిరి టౌన్: గజ్జలరెడ్డిపల్లికి చెందిన బంగారు సానియా (సురేష్) అనే ట్రాన్స్ జెండర్‌పై దాడి ఘటనలో కేసు నమోదు చేసినట్లు స్థానిక పోలీసులు శనివారం తెలిపారు. వివరాలు.. ట్రాన్స్‌జెండర్ సానియా కందికుంట నారాయణమ్మ కాలనీలో నివాసం ఉంటోంది. తన గురువు అయిన చందుతో మాట్లాడేందుకు శుక్రవారం రాత్రి వెళ్తుండగా, అదే కాలనీకి చెందిన ఈశ్వరయ్య, నారాయణస్వామి, సుజాత, నారాయణస్వామి రెండో భార్య సుమతి తనను హేళన చేశారని, ఇలా మాట్లాడడం సరికాదని వారించే ప్రయత్నం చేస్తుండగా తనపై దాడి చేశారని బాధితురాలు సానియా తెలిపింది. ఈ దాడిలో తనకు రక్తగాయమైందని స్థానిక పోలీసులకు శనివారం ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాలు జయప్రదం చేద్దాం



ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న జిల్లా కార్యదర్శి శరత్‌కుమార్

బత్తలపల్లి: రాష్ట్రీయ స్వయంసేవక సంఘ్ శతాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని సంఘ్ జిల్లా కార్యదర్శి శరత్‌కుమార్ పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలోని అయ్యప్పస్వామి ఆలయంలో ఆర్‌ఎస్‌ఎస్ బత్తలపల్లి శాఖ ఆధ్వర్యంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాలు అక్టోబర్ 4న ప్రారంభమవుతాయన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ రాష్ట్ర నాయకులు రాఘవేంద్ర, ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు యోగానంద ఆచారి, చిరంజీవినాయుడు, నారాయణస్వామి, సాకే గోపాల్, కొంకా కాశప్ప, కమతం నారాయణ, బోయ సాంబ పాల్గొన్నారు.

వ్యక్తి మృతి

ఓడీచెరువు: ఈ నెల 24న ఎంబీ క్రాస్ సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని గాయపడిన దారా సోమశేఖర్(52) శనివారం అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ప్రమాదం జరిగిన అనంతరం కదిరి ప్రభుత్వాస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించడంతో అక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య యశోద ఇద్దరు కుమార్తెలు, ఒక కొడుకు ఉన్నారు.

ద్విచక్రవాహనదారుడిపై ఫిర్యాదు

కదిరి టౌన్: ద్విచక్ర వాహనదారుడు సాయికుమార్‌పై మున్సిపాలిటీ పరిధిలోని మేదరవీధికి చెందిన ప్రసాద్‌కుమారుడు కిరణ్‌కుమార్ స్థానిక పట్టణ పోలీసు స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశాడు. వివరాలు.. మేదరవీధికి చెందిన ప్రసాద్ ఈనెల 16న బస్టాండ్ నుంచి స్కూటీలో ఇంటికి వెళ్తుండగా, అదే సమయంలో మదనపల్లి రోడ్డులోని మెడ్‌ప్లస్ మెడికల్ షాపు వద్ద వెనుక వైపు నుంచి ద్విచక్రవాహనదారుడు సాయికుమార్ స్కూటీని ఢీకొన్నాడు. ఈప్రమాదంలో వృద్ధుడు ప్రసాద్‌కు కాలు విరిగింది. దీంతో బాధితుడి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ వి.నారాయణరెడ్డి శనివారం తెలిపారు.

జాతీయ స్థాయిలో రాణింపు



జేసీతో ధ్రువపత్రాన్ని అందుకుంటున్న శైలజ

కదిరి అర్బన్: జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎరుకులవాండ్లపల్లి హరీష్ పాఠశాల 9వ తరగతి విద్యార్థిని శైలజాకు జేసీ అభిషేక్‌కుమార్ చేతుల మీదుగా జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ ధ్రువపత్రాన్ని అందజేశారు. 2024–25 విద్యాసంవత్సరంలో జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో శైలజా ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపాల్ ఎంఎస్ కిరణ్ తెలిపారు. శైలజను ఉపాధ్యాయులు అభినందించారు.

బైకులు ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలు

తనకల్లు: మండలంలోని మబ్బువారిపల్లికి సమీపంలో శనివారం రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని చంద్రానాయక్, రామస్వామి అనే ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు... గోపాల్‌నాయక్ తండాకు చెందిన చంద్రానాయక్ ద్విచక్ర వాహనంపై కొక్కంటిక్రాస్‌కు వెళ్తుండగా అదే సమయంలో రామస్వామి అనే వ్యక్తి ద్విచక్ర వాహనం ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఇద్దరికీ తీవ్ర గాయాలు కాగా, మరో వ్యక్తి గోవిందుకు స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన వారిని వందేమాతరం టీం సభ్యులు ఉచిత అంబులెన్స్‌లో కదిరి ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యుల సూచన మేరకు తీవ్రంగా గాయపడిన చంద్రానాయక్, రామస్వామిని అనంతపురం ఆస్పత్రికి తీసుకెళ్లారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక పోలీసులు తెలిపారు.

వినాయక నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన

బత్తలపల్లి: సంఘమేశ్వర క్షేత్రం సమీపంలోని చిత్రావతి నదిలో వినాయక నిమజ్జన ఏర్పాట్లను ఎంపీడీఓ నరసింహనాయుడు, ఈఓఆర్డీ క్రిష్టప్ప, ఎస్ఐ సోమశేఖర్ తదితరులు శనివారం పరిశీలించారు. శుక్రవారం నిమజ్జనం చేసేందుకు నీటి లోతును పరిశీలించే క్రమంలో ఓ యువకుడు మృతి చెందిన విషయం తెలిసిందే. దీంతో అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. ఇదిలా ఉండగా సాయంత్రం ధర్మవరం రూరల్ సీఐ ప్రభాకర్, ట్రాన్స్‌కో ఏఈ శివయ్యతో కలిసి సంఘమేశ్వర క్షేత్రం వద్ద నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించారు.